సాక్షి
జగిత్యాల

ఆదివారం । 23 । మార్చి । 2025



నృసింహస్వామి ఏకాంతోత్సవం

ధర్మపురి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్లకు ఏకాంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.



కూచిపూడి నృత్య ప్రదర్శనలు

ధర్మపురి: నృసింహుని బ్రహ్మోత్సవాల్లో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ధర్మపురికి చెందిన గుండి లాస్య ప్రియ నాట్యబృందం ప్రదర్శన ఇచ్చింది.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సా॥)	సహర్ సోమవారం (ఉ॥)
కరీంనగర్ :	6.29	4.58
పెద్దపల్లి :	6.34	4.56
సిరిసిల్ల :	6.28	5.06
జగిత్యాల :	6.34	4.56

న్యూస్‌రీల్

జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా స్పందన



జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా స్పందన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రాయికల్ ఎంపీడీవో చిరంజీవి ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగారు. సంగారెడ్డి జిల్లాలో మెప్మా ఏవోగా పనిచేస్తున్న స్పందనను కమిషనర్‌గా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపాలిటీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇన్‌చార్జి కమిషనర్ చిరంజీవి, మున్సిపల్ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

నానో యూరియా వాడండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విండో, ఇఫ్కో ప్రతినిధులు

సారంగాపూర్: నానో యూరియా వాడి రైతులు దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావాలని విండో సీఈవో లైశెట్టి శివ, ఇఫ్కో కంపెనీ ప్రతినిధి శ్రీధర్ అన్నారు. స్థానిక సింగిల్‌విండో ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నానో యూరియాపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. యూరియా బస్తాపై కేంద్ర ప్రభుత్వం రూ.2200 సబ్సిడీ భరిస్తోందని, రైతులకు మాత్రం రూ.270కి అందిస్తోందని అన్నారు. రసాయనాలు లేని నానో యూరియా వాడడం ద్వారా భూమి సారం మరింత పెరిగి, భూమి లోపలి పోషకాల సమతుల్యత దెబ్బ తినకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విండో డైరెక్టర్లు కొండ్ర రాంచంద్రారెడ్డి, కాయితి శేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కమిషనర్లొస్తున్నారు..

- ఎంపీడీవోలకు ఇన్‌చార్జి ఇవ్వడంపై విమర్శలు

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల/కోరుట్ల: మున్సిపాలిటీ పాలనపై అవగాహన లేని ఎంపీడీవోలను జిల్లాలోని కొన్ని బల్దియాలకు ఇన్‌చార్జి కమిషనర్లుగా నియమించారు. ఈ విషయాన్ని 'సాక్షి' 'ఇదేమీ తీరు' శీర్షికన శనివారం ప్రచురించింది. ఈ క్రమంలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పందించింది. ముందుగా జగిత్యాల ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న రాయికల్ ఎంపీడీవో చిరంజీవిని తొలగించి సంగారెడ్డిలో మెప్మా ఏవోగా పనిచేస్తున్న స్పందనను నియమించింది. కోరుట్ల కమిషనర్‌గా ఉన్న తిరుపతి సస్పెండ్‌గా ఆయన స్థానంలో ఎంపీడీవో రామకృష్ణకు బాధ్యతలు ఇచ్చారు. అలాగే ధర్మపురి కమిషనర్ ఏసీబీకి పట్టుబడగా.. అతని స్థానంలో కూడా ఎంపీడీవోకు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవోలకు కమిషనర్‌గా బాధ్యతలు ఇవ్వడంపై అభ్యంతరాలు వెల్లువెత్తడంతో మున్సిపల్ వర్గాల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. పూర్తిస్థాయి కమిషనర్లను నియమించాలన్న ఉద్దేశంతో కొందరు సాక్షి కథనాన్ని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు పంపించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్చిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. జగిత్యాలకు కమిషనర్‌ను నియమించినట్లే త్వరలోనే కోరుట్ల, ధర్మపురికి కూడా రెగ్యులర్ కమిషనర్లను నియమించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీల్లో కమిషనర్లు బదిలీ అయితే వారిస్థానంలో డీఈలకు, టీపీవోలు, మేనేజర్లకు ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలు ఇస్తారు. ఎంపీడీవోలకు ఇవ్వడం ఇబ్బందికరంగా మారింది.

పంట పొలాల వద్ద పాంపాండ్లు నిర్మించుకోవాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కథలాపూర్: పంట పొలాల వద్ద నీటి నిల్వల కోసం పాంపాండ్లను ఏర్పాటు చేసుకోవాలని భూగర్భజలశాఖ ఏడీ నాగరాజు తెలిపారు. మండలంలోని గంభీర్‌పూర్‌లో భూగర్భజల శాఖ, ఆదరణ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరించి రైతులకు పంపిణీ చేశారు. వర్షకాలంలో నీటి నిల్వలు ఉండేలా రైతులు జాగ్రత్తపడాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే భూగర్భజలాలు పెరిగే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ఏవో యోగితా, అధికారులు శ్రీకుమార్, అకిల్, శ్రీలత, గంగాలక్ష్మణ్, లింబాద్రి పాల్గొన్నారు.

బాటిల్‌నెట్ @ నోయూజ్

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



- ఇది కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాటిల్ నెట్. ఇది పార్కింగ్ ఏరియాలో ఏర్పాటు చేయడంతో యూస్ లేకుండా పోయింది. కలెక్టరేట్‌కు నిత్యం వందలాది మంది వస్తుంటారు. ప్రజావాణి రోజు వివిధ సమస్యల ఫిర్యాదుల కోసం వస్తుంటారు. కానీ.. ఇందులో ప్లాస్టిక్ బాటిళ్లు వేసిన పాపాన పోలేదు.



ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్ వద్దగల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ముందు ఏర్పాటు చేసిన బాటిల్ నెట్. దీనిని పెట్టి దాదాపు రెండేళ్లు అవుతోంది. అయినా ఏ ఒక్క బాటిల్ వేసిన పాపాన పోలేదు. ఏదో నామమాత్రంగా పెట్టినట్లుందే తప్ప దానిని ఎవరూ యూజ్ చేయడం లేదు. వాటిపై అవగాహన లేకపోవడం ఒకింత కారణంగా తెలుస్తోంది. ప్రజలు వాటర్‌బాటిళ్లు, ఇతరత్రా ప్లాస్టిక్ వస్తువులను రోడ్డుపై లేకుంటే డ్రైనేజీల్లో పడేస్తున్నారు.



- ఇది ధర్మపురిలో ప్లాస్టిక్ వస్తువులు, ఇతరత్రా వస్తువులు వేసేందుకు వీలుగా చుట్టూ జాలి ఏర్పాటు చేశారు. ఇందులో ఎవరూ వేసిన పాపాన పోలేదు. గోదావరిలోనే ప్లాస్టిక్ బాటిల్స్ విచ్చలవిడిగా పడేస్తున్నారు. దీంతో పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం అనేక మంది భక్తులు వస్తుంటారు. ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో ప్లాస్టిక్ వస్తువులన్నీ గోదావరిలోనే పడేస్తున్నారు.



- ఇది రాయికల్‌లోని ఓ మురికికాలువ. మున్సిపాలిటీలో బాటిల్‌నెట్స్ లేకపోవడంతో డైనేజీల్లోనే ప్లాస్టిక్ వస్తువులు పడేస్తున్నారు. ప్లాస్టిక్‌తో పూర్తిగా నిండిపోవడంతో మురికినీరు కదలలేక ప్రజలకు ఇబ్బందిగా మారింది.

- ప్రజాధనం వృథా
- కొన్ని మున్సిపాలిటీల్లోనే ఏర్పాటు
- డ్రైయినేజీల్లోనే ప్లాస్టిక్ చెత్త

జగిత్యాల: ప్లాస్టిక్ వాడొద్దని, బాటిళ్లు యూజ్ చేయవద్దని ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు ఇచ్చినా.. హెచ్చరించినా.. ప్రజలు మాత్రం ప్లాస్టిక్ వాడటం మానడం లేదు. ఎక్కువగా వాటర్‌బాటిల్స్ కొనుగోలు చేసుకుని వాడుతుంటారు. తినడానికి ఏవైనా కొనుగోలు చేసినా హోటళ్ల నిర్వాహకులు కవర్లలోనే ప్యాకింగ్ చేస్తూ ఇస్తుంటారు. వీటిని కొనుగోలు చేసుకుని బాటిళ్లలోని నీటిని తాగుతూ వాటిని ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నారు. ముఖ్యంగా బస్టాండ్లు, ఆస్పత్రులు, పెద్దపెద్ద హోటళ్ల వద్ద ఈ సంఘటనలు చోటుచేసుకుంటాయి. వీటిని నివారించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం అత్యంత వ్యయంతో బాటిల్‌నెట్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని జగిత్యాల మున్సిపాలిటీలో తప్ప వేరే మున్సిపాలిటీల్లో ఎక్కడా ఏర్పాటు చేయలేదు. బాటిల్ ఆకారంలో ఉండే బాటిల్‌నెట్‌లను కొనుగోలు చేసి ప్రధానమైన చోట్ల ఏర్పాటు చేశారు. ఒక బాటిల్‌నెట్‌కు రూ.18 వేలు వెచ్చించారు. జిల్లా కేంద్రంలో సుమారు 15 ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడా ఉపయోగంలో లేవు. దాంట్లో ఎవరూ వేసిన పాపాన పోలేదు. దాదాపు జగిత్యాలలో రూ.2.70 లక్షల ప్రజాధనం వృథాగానే మారిందని చెప్పవచ్చు. వాస్తవానికి వీటిని యూజ్ చేస్తే ఎన్నో ఉపయోగాలుంటాయి. అటు స్వచ్ఛ సర్వేక్షణ్‌తోపాటు ఇటు ఎలాంటి ప్రమాదాలూ లేకుండా ఉంటాయి. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్స్‌గానీ, బాటిల్స్ గానీ రోడ్లపై పడేస్తే ప్లాస్టిక్ కవర్లు ఆవులు తిని అనారోగ్యానికి గురికాగా.. ప్లాస్టిక్ బాటిల్స్ మురికికాలువలో పడేయడంతో వాటితోనే నిండిపోవడంతో మురికినీరు బయటకు వెళ్లక రోడ్డుపైనే ప్రవహిస్తోంది. రోడ్డుపై వాటర్ బాటిల్స్ ఉంటే వాహనదారులు దానిపై వెళ్తే వాహనం పడిపోయి ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి.

అవగాహన లేకనే

బాటిల్‌నెట్స్ వాటర్‌బాటిల్ ఆకారంలోనే ఏర్పాటు చేసి కొన్ని చోట్లలో ఏర్పాటు చేశారు. వీటిపై ఎవరికీ అవగాహన కల్పించకపోవడం, ప్లాస్టిక్ వస్తువులు, బాటిల్స్ ఇందులోనే వేయాలని తెలపకపోవడంతో ప్రజలు ఇష్టానుసారంగా పడేస్తున్నారు. ముఖ్యంగా పార్క్‌లలో అయితే ఎక్కబడితే అక్కడ ప్లాస్టిక్ వస్తువులు పడేస్తున్నారు. అధికారులు స్పందించి బాటిల్‌నెట్‌లలోనే ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు వేయాలని, లేనిచో చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం.. లేకుంటే జరిమానాలు వేయడం వంటివి చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాటిల్‌నెట్‌లు ఏర్పాటు చేయాలి



కోరుట్ల పట్టణంలో బాటిల్ నెట్స్ ఏర్పాటు చేయలేదు. ప్లాస్టిక్ బాటిళ్లు రోడ్డుపైనే పడేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, వార్డుల్లో రహదారుల వెంట ఏర్పాటు చేయాలి. మురికికాలువలోనే పడేస్తున్నారు. అధికారులు స్పందించాలి.

– విఘ్నేశ్, కోరుట్ల

ఉపయోగించుకోవాలి



ధర్మపురిలో బాటిల్‌నెట్ పూర్తిస్థాయిలో లేవు. గోదావరి పరిసర ప్రాంతంలో జాలీలు ఏర్పాటు చేసినప్పటికీ అందులో వేయడం లేదు. మున్సిపల్ అధికారులు బాటిల్‌నెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుని అందులో వేసేలా చూడాలి.

–లవన్‌కుమార్, ధర్మపురి

ప్రధాన కూడళ్లలో పెట్టాలి



బహిరంగ కూడళ్లలో బాటిల్‌నెట్స్ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటాయి. మెట్‌పల్లిలో ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. అధికారులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు సైతం వాటిపై అవగాహన కల్పించాలి.

– షరీఫొద్దీన్, మెట్‌పల్లి

మురికికాలువలో వేస్తున్నారు



ప్లాస్టిక్ బాటిల్స్, ఇతరత్రా వస్తువులన్నీ మురికికాలువల్లోనే వేస్తున్నారు. దీంతో డ్రైనేజీలన్నీ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. బాటిల్స్ రోడ్డుపై పడేయడంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించాలి.

– రంజిత్, రాయికల్

నేడు బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

- ముఖ్య అతిథులుగా కేటీఆర్, హరీశ్‌రావు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సన్నహాక సమావేశం ఆదివారం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని వీ–కన్వెన్షన్‌లో జరగనుంది. ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశాన్ని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు హాజరు కానున్నారు. శనివారం వీకన్వెన్షన్ ఫంక్షన్‌హాల్ వద్ద ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఏర్పాట్లు పరిశీలించారు. సమావేశానికి పార్టీ మాజీ కార్పొరేటర్లు, మాజీ కో– ఆప్షన్ మెంబర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

జమిలి ఎన్నికలకు సీపీఐ వ్యతిరేకం

కోరుట్ల: కేంద్రప్రభుత్వం తీసుకొస్తామంటున్న జమిలి ఎన్నికలకు సీపీఐ వ్యతిరేకమని ఆ పార్టీ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని సీ.ప్రభాకర్ భవన్‌లో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. జనాభా ప్రాతిపాదికన పార్లమెంట్ నియోజకవర్గాలు పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గి ఉత్తరాది రాష్ట్రాల ఆజమాయిషీ పెరిగి నష్టపోతామన్నారు. దేశంలో నక్సలిజం, కమ్యూనిస్టులను రూపుమాపే యత్నాలు జరుగుతున్నాయన్నారు. 7 లక్షల కోట్ల అప్పు ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. పార్టీ జిల్లా నేతలు వెన్న సురేష్, చెన్నా విశ్వనాథం, సుతారి రాములు, కొక్కుల శాంత, రాధ, మౌలాన, ముక్రం తదితరులు పాల్గొన్నారు.

అకాలవర్షం.. భారీగా పంట నష్టం

- నేలవాలిన మామిడి, వరి, మొక్కజొన్న పంటలు
- ప్రాథమిక నివేదిక రూపొందిస్తున్న అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సింగారపు మల్లేశం. తనకున్న భూమిలో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేశాడు. ప్రస్తుతం పంట చేతికొచ్చే దశలో ఉంది. శనివారం వేకువజాము వరకు కురిసిన అకాల వర్షానికి పంటంతా నేలకొరింది. ఈదురుగాలులకు ధాన్యం కూడా రాలిపోయింది. దీంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు ఈ రైతు.

జగిత్యాలఅగ్రికల్చర్/జగిత్యాలరూరల్/గొల్లపల్లి/వెల్గటూర్/ధర్మపురి: జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో రైతన్న భారీగా నష్టపోయాడు. ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో పంటలు నేలవాలాయి. మామిడి, నువ్వు, మొక్కజొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వ్యవసాయ, ఉద్యాన పంటలు సుమారు 5,532 ఎకరాల్లో నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా నివేదిక రూపొందించారు. కలెక్టర్ సత్యప్రసాద్ వెల్గటూర్, ధర్మపురి మండలాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ జగిత్యాల రూరల్, ధర్మపురి, జిల్లా ఉద్యానశాఖాధికారి శ్యాం ప్రసాద్ కొడిమ్యాల, మల్యాల మండలాల్లో పర్యటించారు. 33 శాతానికి మించి నష్టపోయిన పంటలను అంచనా వేశారు. ధర్మపురిలో 1495 ఎకరాలు, సారంగాపూర్‌లో 18, పెగడపల్లిలో 100, బుగ్గారంలో 257, ఎండపల్లిలో 123, మేడిపల్లిలో 5, వెల్గటూర్‌లో 270, బీర్‌పూర్‌లో 8, జగిత్యాల రూరల్ మండలంలో 735, గొల్లపల్లిలో 365 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉద్యానశాఖ అధికారులు ఆయా మండలాల్లో పర్యటించి దాదాపు 549 రైతులకు చెందిన 2156 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నివేదిక రూపొందించారు.

33శాతం నిబంధన రైతులకు శాపం

పంట నష్టం 33 శాతానికి మించి జరిగితేనే అధికారులు నివేదికలు తయారు చేయడం రైతులకు శాపంగా మారింది. వారంలో కోతకు వచ్చే పంటలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లి, సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేసారు.

పెగడపల్లిలో 47.3 మి.మీ వర్షపాతం

పెగడపల్లి మండలంలో అత్యధికంగా 47.3 మి.మీ వర్షపాతం నమోదైంది. బుగ్గారం మండలం సిరికొండలో 39.3 మి.మీ, ఎండపల్లి మండలం గుల్లకోటలో 38.3 మి.మీ, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 35 మి.మీ, గొల్లపల్లిలో 33.3 మి.మీ, ధర్మపురి మండలం నేరేళ్లలో 32.8 మి.మీ, జైనాలో 25.3 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. మరో రెండు మూడు రోజులు కూడా మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెపుతున్నారు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని రాంనూర్‌లో అకాలవర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్డీవో మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి రాంచందర్, మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్ పాల్గొన్నారు.




లక్ష్మీపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



మామిడి పంట వివరాలు సేకరిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి శ్యాంప్రసాద్



పొరండ్లలో నేలకొరిగిన నువ్వు పంట



హైదర్‌పల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

వృద్ధులను విస్మరిస్తే చర్యలు




కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏవో, సీనియర్ సిటిజన్స్

జగిత్యాల: వృద్ధులను విస్మరిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏవో తఫజుల్ హుస్సేన్ అన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో పొలాస గ్రామానికి చెందిన నర్సవ్వ, పట్టణానికి చెందిన భారతి, ధర్మపురి మండలం జైనకు చెందిన బాలమ్మ, సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన బుచ్చవ్వ, మల్యాల మండలం పోతారానికి చెందిన కస్తూరి రాజంవీరు కుమారులు, కూతుళ్లు, కోడళ్లు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేయగా వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 2007 సంరక్షణ చట్టం ప్రకారం వారిని ఆదుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇప్పటికీ చాలామంది శిక్ష పడిందని పేర్కొన్నారు. విచారణకు హాజరు కాని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విచారణలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కో–కన్వీనర్ కోమటి చంద్రశేఖర్



వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

జగిత్యాలటౌన్: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కో–కన్వీనర్ కోమటి చంద్రశేఖర్ ప్రభుత్వానికి సూచించారు. కార్మికులకు వేతనాల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించాలని జిల్లా కమిటీ ఆధర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయ పాలనాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ సిబ్బందికి నష్టదాయకంగా మారిన జీవో 51ను సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, పాత కేటగిరీలను అమలు చేయాలని కోరారు. బకాయిల చెల్లింపులకు పంచాయతీల నుంచి కార్యదర్శులు చెక్కులు అందించి మూడు నెలలు గడుస్తున్నా నిధులకు మోక్షం కలగలేదన్నారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు ఉన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటుపై ఆందోళన

మెట్‌పల్లిరూరల్: పెద్దవాగును ఇసుక రీచ్‌గా ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ మెట్‌పల్లి మండలం ఆ త్మకూర్‌లో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రా మ పంచాయతీ ఎదుట బైటాయించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని రీచ్‌ను రద్దు చే యాలని డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాలతో భూ గర్భజలాలు తగ్గిపోయే ప్రమాదముందన్నారు. తా గు, సాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, ఈ పరిస్థితుల్లో రీచ్ ఏర్పాటు సరికాదని మండిపడ్డారు. అనంతరం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఉపాధి పనికి వెళ్లి.. కుప్ప'కూలీ'


లచ్చయ్య (ఫైల్)

చందుర్తి (వేములవాడ): ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఓ కూలీ మృతిచెందిన ఘటన చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాలు.. మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన పసుల లచ్చయ్య (58) శనివారం గ్రామంలో ఉపాధి పథకంలో భాగంగా మట్టిరోడ్డు నిర్మాణ పనులకు వెళ్లాడు. ఉదయం 9.30 గంటలకు భోజనం చేసేందుకు చెట్టు కిందికి వస్తున్న క్రమంలోనే స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే తోటి కూలీలు మోటారు సైకిల్‌పై వేములవాడ తరలించేందుకు మల్లారం గ్రామం వరకు వెళ్లగా.. అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా వారంరోజులుగా ఎండలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా వడదెబ్బతో మృతి చెందాడని అనుమానాలు వ్యక్తం కావడంతో మృతదేహానికి పోస్టుమార్టం చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గుండారం శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రగాయాలకు గురయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండాకు చెందిన భూక్య జవహర్, లాల్‌సింగ్ ద్విచక్ర వాహనంపై మండలంలోని రాచర్లగొల్లపల్లికి వచ్చి తిరిగి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఇద్దరికి గాయాలు కాగా లాల్‌సింగ్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రైవేట్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్ రోడ్‌లో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వడ్లూరి రాజు, వడ్లూరి కిషన్ బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రి, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు.

చెవికమ్మ అప్పగింత



శంకరపట్నం (మానకొండూర్): ఆర్టీసీ బస్సులో ఓ మహిళ చెవికమ్మ పోగొట్టుకోగా కండక్టర్ సుధాకర్ వెతికి బాధితురాలి బంధువుకు అందించిన ఘటన కేశవపట్నం బస్టాండ్‌లో వెలుగుచూసింది. హుజురాబాద్‌కు చెందిన ఓ మహిళ శనివారం హనుమకొండలో నిజామాబాద్ డిపో బస్సు ఎక్కింది. హుజూరాబాద్ బస్టాండ్ రాగానే బస్సు దిగింది. చెవి కమ్మ కనిపించకపోవడంతో బస్సు సీట్లో పడిపోయి ఉంటుందని, టికెట్ ఆధారంగా కండక్టర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో కండక్టర్ బస్సులో వెతికాడు. సదరు మహిళ కూర్చున్న సీటు వద్ద చెవికమ్మ కనిపించడంతో బాధితురాలికి విషయం తెలిపాడు. కేశవపట్నంలో తమ బంధువులు ఉన్నారని, వారిని పంపిస్తానని బాధిత మహిళ చెప్పడంతో.. స్వరూప అనే మహిళకు కండక్టర్ చెవికమ్మ అందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మహేశ్(ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పిల్లలు పుట్టడం లేదనే మనస్థాపంతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై రామ్మోహన్ తెలిపిన వివరాలు. మామిండ్ల మహేశ్(30)కు నాలుగేళ్ల క్రితం కల్పనతో వివాహమైంది. పిల్ల లు పుట్టడం లేదని మానసికంగా వేదనకు గురయ్యాడు. ఈనెల 17న పురుగుల మందు తాగగా.. ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్టీరింగ్ ఊడి.. బోల్తా పడి


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, స్థానికులు


బాధితుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు


బోల్తాపడిన ఆటో

16 మంది మహిళా కూలీలకు గాయాలు
- మిర్చి ఏరేందుకు తీసుకెళ్తుండగా బోల్తాపడిన ఆటో
- ముగ్గురి పరిస్థితి విషమం.. ఆస్పత్రులకు తరలింపు

మంథని: వ్యవసాయ పనుల కోసం కూలీలను తీసుకెళ్తున్న ఆటో పెద్దపల్లి జిల్లా కాటారం– మంథని ప్రధాన రహదారి నాగేపల్లి క్రాస్ వద్ద బోల్తాపడిన ప్రమాదంలో 16 మంది గాయపడ్డారు. ఇందులో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా కరీంనగర్, గోదావరిఖని ఆస్పత్రులకు తరలించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన 16 మంది మహిళా కూలీలు శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం మల్లారంలో మిర్చి ఏరేందుకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో ఆటో స్టీరింగ్ రాడ్ ఊడి అదుపుతప్పి బోల్తాపడింది. అందులోని కూలీలకు గాయాలయ్యాయి.

ఆస్పత్రులకు తరలింపు..

ఆటో బోల్తాపడిన ఘటనలో గాయపడినవారిని దారివెంట వచ్చే వాహనాలతోపాటు స్థానికులు సమకూర్చిన వాహనాల్లో మంథనిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో బొందల కిష్టమ్మ తల, అప్పాల శైలజ చేయి, అప్పల వనిత భుజానికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. గడ్డి మల్లక్క, సత్తమ్మ, సమత, ఎర్రమ్మ, కందుల రాజేశ్వరి, పోసక్క, కోలగాని సమ్మక్క, గౌరక్క, జంగ లక్ష్మి, కమ్మటోయిన స్రవంతి, కమల, బోధ మల్లమ్మతోపాటు మరో మహిళా కూలీని పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. డ్రైవర్ సతీశ్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు అధికారులను అప్రమత్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. కాంగ్రెస్ సోషల్ మీడియా నాయకులు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గాయపడినవారిని గోదావరిఖనిలో ఏసీపీ రమేశ్, మంథని సీఐ రాజు, ఎస్సై రమేశ్‌తోపాటు పోలీస్ సిబ్బంది కలిసి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిందితులకు శిక్ష పడేలా చూడాలి


పోలీసులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

- రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా

గోదావరిఖని(రామగుండం): నిందితులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగేలా కోర్టు కానిస్టేబుళ్లు మానవత్వంతో మెదలాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా స్పష్టం చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో శనివారం కమిషనరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నిందితులకు శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. నేరస్తులకు వారెంట్లు, సమన్లు సత్వరం ఎగ్జిక్యూట్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్లు సీసీటీఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటే మనపై నమ్మకం పెరుగుతుందన్నారు. కాగా కోర్టు డ్యూటీ విధుల్లో క్రమశిక్షణతో పనిచేస్తూ హత్య, హత్యాయత్నం, చీటింగ్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషిచేసిన, లోక్ అదాలత్ కేసుల్లో ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, లీగల్‌సెల్ సీఐ కృష్ణ, సీసీఆర్‌బీసీ సీఐ సతీశ్, ఐటి సెల్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్, సీసీ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రపురికి ఆధ్యాత్మిక శోభ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

మంథని: నిత్యం వేద ఘోషతో పరిఢవిల్లె మంత్రపురి మరో అరుదైన ఘట్టానికి వేదిక కాబోతుంది. మంథనిలోని లక్ష్మీ నృసింహగార్డెన్‌లో ఆదివారం సామూహిక గీతా పారాయణం నిర్వహించనున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలువురు పీఠాధిపతులు హాజరుకానున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐదువేల మందితో..

గతంలో ఎక్కడా లేని విధంగా మంథనిలో ఐదు వేల మందితో సామూహిక గీతా పారాయణం నిర్వహించనున్నారు. అయితే ప్రపంచంలోనే ఇలాంటి ఉత్సవం జరగలేదని సనాతనధర్మ సంస్థ ప్రతినిధులు అంటున్నారు. భగవద్గీతను ఇంటింటా చేర్చడానికి ఐదేళ్ల క్రితం ఉద్యమం ప్రారంభం కాగా, 40 వేల మందికి చేర్చినట్లు ఇటీవల సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలోని 70 ప్రాంతాలకు చెందిన గీత పారాయణ భక్తులు హాజరుకానున్నారు. అలాగే తెలుగు సాహితీ వేత్త, భగవత్ గీత ప్రవచకులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి హాజరవుతారు. మంథనిలోని శ్రీలక్ష్మీనారాయణ ఆలయం నుంచి ఉదయం 8.30 గంటలకు శోభాయాత్ర నిర్వహించిన అనంతరం సామూహిక గీత పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిసారు.

సూత్రధారి ఎవరు?

- టీడీఎస్ సొమ్ము స్వాహాపై విచారిస్తున్న అధికారులు
- బాధ్యులపై చర్యలకు రంగం సిద్ధం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో టీడీఎస్‌కు సంబంధించి సొమ్ము కాజేసిన ఘటనలో సూత్రధారి ఎవరన్నదానిపై విచారణ జరుగుతోంది. జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు టాక్స్ ప్రాక్టిషనర్ ఈ వ్యవహారానికి తెరలేపినట్లు తెలుస్తోంది. జిల్లాలో 2006లో రైల్వేలైన్ మంజూరైన సమయంలో దాదాపు 200 మందికి చెందిన రైతులకు సంబంధించి భూములు కోల్పోయారు. దీనికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఈ నష్టపరిహారాన్ని డిపాజిట్ చేశారు. ఆదాయపు పన్ను శాఖ వారు పాన్‌కార్డు ఉన్న రైతుల నుంచి 10 శాతం, లేని రైతుల నుంచి 20 శాతం చొప్పున టీడీఎస్ కట్ చేశారు. ఇందులో 36 మంది రైతులకు పాన్‌కార్డు లేకపోవడంతో వారి సొమ్మును క్లెయిమ్ చేసుకునేందుకు ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. టీడీఎస్ సొమ్ముకు సంబంధించిన భూ నిర్వాసితుల వివరాలు రెవెన్యూ అధికారులు ఇచ్చినప్పటికీ వారి పేర్లు కాకుండా ఇతరుల పేర్లపై క్లెయిమ్ చేసి సొమ్ము కాజేసినట్లు ఇన్‌కమ్ టాక్స్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం విచారణ చేపట్టారు. సూత్రధారి ఎవరన్నదానిపై విచారణ చేపడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. దాదాపు 36 మంది రైతులకు చెందిన సుమారు రూ.50 లక్షల వరకు గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది.

30 నుంచి శ్రీరామ నవరాత్రోత్సవాలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 6 వరకు శ్రీరామ నవరాత్రోత్సవాలు ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం తెలిపారు. రోజూ ఉదయం 6.30 గంటలకు స్వామివారికి, సీతారామచంద్ర స్వామికి, పరివార అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 30న ఉగాది పండుగ పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు, సాయంత్రం 4.30 గంటలకు పంచాంగ శ్రవణము, పండిత సత్కారం నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు స్వామివారి పెద్దసేవపై ఊరేగిస్తారు. ఏప్రిల్ 4 నుంచి 6 వరకు భక్తోత్సవం, 6న ఉదయం 11.55 గంటలకు సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని ఈవో పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం పూర్ణాహుతి, రథోత్సవం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

చెట్టుకొమ్మలు కొడుతుండగా..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


చెట్టుపై నర్సయ్య మృతదేహం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బోయినపల్లి(చొప్పదండి): చెట్టు కొమ్మలు కరెంట్ తీగలపై పడుతున్నాయని.. కొమ్మలు కొట్టే ప్రయత్నంలో ఓ కొమ్మ మేయిన్ విద్యుత్ తీగపై పడి మండలంలోని మాన్వాడ గ్రామానికి చెందిన దాసరి నర్సయ్య (58) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మాన్వాడకు చెందిన నర్సయ్య ఇంటి ముందు ఉన్న మునగ చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడుతున్నాయని శనివారం కొమ్మలు కొట్టడానికి చెట్టు ఎక్కాడు. కొమ్మలు కొడుతుండగా ఓ కొమ్మ విద్యుత్ మేయిన్ తీగపై పడడంతో నర్సయ్యకు విద్యుత్ షాక్ తగిలి చెట్టుపైనే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా 'మానేరు' వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ఉమేశ్‌కుమార్


నృత్యం చేస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల 39వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్‌ఈ పాఠశాల ఆవరణలో అట్టహాసంగా జరిగాయి. తేజస్– 2025 పేరిట నిర్వహించిన వేడుకలను శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఉమేశ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 39 ఏళ్లుగా మానేరు విద్యాసంస్థలు దిగ్విజయంగా నడుస్తుండడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ, 1986లో కరీంనగర్‌లో 80 మంది విద్యార్థులతో ప్రారంభమైన విద్యాసంస్థలు నేడు ఎన్నో వేల మందికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించేలా రూపుదిద్దుకున్నట్లు తెలిపారు. విద్యాసంస్థలలో చదివిన చాలా మంది నేడు ఉన్నతస్థానాలకు ఎదిగారని వివరించారు. అనంతరం మానేర్ క్యాట్ 2025 పరీక్షలో టాప్ టెన్‌లో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి, కడారి సునీతారెడ్డి, మాజీ కార్పొరేటర్‌లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్

- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: హనుమాన్ చిన్న జయంతికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామి జయంతి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భక్తులకు తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ తదితర వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో నిత్యం శానిటేషన్ నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 11 నుంచి 13 వరకు నిర్వహించే హనుమాన్ చిన్న జయంతికి ఇప్పటి నుంచే అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు


దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్, బస్సు ముందుభాగం

కోరుట్ల: పట్టణంలోని కృష్ణ మందిరం వద్ద జాతీయ రహదారిపై శనివారం గౌతమ్ హైస్కూల్‌కు చెందిన బస్సు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. బస్సులో డ్రైవర్, క్లీనర్ తప్ప ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసుల వివరాలు.. స్కూల్ ముగిసిన తర్వాత విద్యార్థులను ఇళ్లకు చేర్చి వెళ్లే క్రమంలో జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా డ్రైవర్ మారుతి బస్సు వేగంగా నడపడంతో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. బస్సు ముందుభాగం దెబ్బతింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి పేలింది. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ డిపోలో ట్రాక్టర్ పరికరాలు మాయం


ఆర్టీసీ డిపోలో ట్రాక్టర్

కోరుట్ల: ఇసుక అక్రమ రవాణా కారణంగా కోరుట్ల ఆర్టీసీ డిపోలో ఉంచిన ట్రాక్టర్ నుంచి విడిభాగాలు మాయం కావడం ఆర్టీసీ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది. వివరాలు.. ఫిబ్రవరి 24న అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్(టీఎస్ 21టీ 4499)ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అనంతరం రూ.25 వేలు జరిమానా వేసి ట్రాక్టర్‌ను ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈక్రమంలో ట్రాక్టర్ యజమాని సంగ గంగాధర్ రెండు రోజుల క్రితం జరిమానా కట్టి రెవెన్యూ అధికారుల నుంచి ట్రాక్టర్ రిలీజ్ ఆర్డర్ తీసుకుని ఆర్టీసీ డిపోకు వెళ్లగా సుమారు రూ.5 వేలు విలువైన ట్రాక్టర్ విడి భాగాలు కనిపించలేదు. డిపోలో ఉంచిన ట్రాక్టర్ నుంచి విడి భాగాలు ఎలా మాయమయ్యాయని ఆందోళన చెందిన గంగాధర్ రెండురోజుల క్రితం డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై డిపో మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ, ఆర్టీసీ డిపోలో ఉన్న సమయంలో ట్రాక్టర్ విడి భాగాలు మాయమైనట్లు తమకు ఫిర్యాదు వచ్చిందని పూర్తి స్థాయి విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

పురుగులమందు తాగి.. ఆపై ఉరేసుకుని..

- భర్త వైద్య పరీక్షలు చేయించుకోవడం లేదని మనోవేదన
- తెలుకుంటలో వివాహిత ఆత్మహత్య


పద్మ(ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): తెలుకుంట గ్రామానికి చెందిన వివాహిత మేకల పద్మ(48) శుక్రవారం రాత్రి పురుగులమందు తాగి, ఆ తర్వాత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త మేకల తిరుపతి, ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. తిరుపతి ఉపాధి కోసం 13ఏళ్ల క్రితం మలేషియా దేశానికి వెళ్లాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పట్నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. అయితే, నెలరోజుల క్రితం అతడికి జ్వరం వచ్చింది. పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించగా.. వైద్యులు మందులు ఇచ్చారు. ఆ మందులు వాడినా జ్వరం తగ్గలేదు. దీంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోగా టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. విదేశాలకు వెళ్లివచ్చినందున మరికొన్ని వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అందుకు తిరుపతి ఒప్పుకోలేదు. పరీక్షలు చేయించుకోవాలని అతడి భార్య పద్మ కూడా అనేకసార్లు చెప్పినా నిరాకరించాడు. దీంతో మనోవేదనకు గురైన పద్మ ఇంట్లోని పురుగుల మందు తాగి, దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. మృతురాలి కూతురుకు వివాహం కాగా, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జరిమానా


తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన ఓ మహిళ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో శనివారం తహసీల్దార్ సుజాత జరిమానా విధించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు. అల్మాస్‌పూర్‌కు చెందిన భూక్య జ్యోతి గతంలో నాటుసారా తయారు చేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడింది. జ్యోతిని అరెస్ట్ చేసిన అధికారులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ సమయంలో తిరిగి సాటుసారా తయారు చేయబోమని నగదు పూచీకత్తుపై అప్పటి తహసీల్దార్‌కు ఒప్పందపత్రం రాసి ఇచ్చారు. కాగా జ్యోతి మళ్లీ నాటుసారా తయారు చేసి విక్రయిస్తూ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన జ్యోతిని ఎక్సైజ్ అధికారులు శనివారం అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా రూ.20వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. దాడిలో సిబ్బంది రాజేందర్, రాజు, మల్లేశ్, కిశోర్‌కుమార్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్


యువకుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): ఓ వైపు కూలీ పని చేస్తూ.. మరోవైపు గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన పోగుల అజయ్ కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం కోరుట్లకు వచ్చి విగ్రహాలు తయారు చేసే షాపులో పని చేస్తున్నాడు. శనివారం ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ సిబ్బందితో కలిసి మేడిపల్లి క్రాసింగ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, అజయ్ బైక్‌పై అటువైపు వచ్చాడు. అక్కడ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంబడించి పట్టుకున్నారు. అనంతరం అతడి జేబులను పరిశీలించగా 300 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయి, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఒక గంజాయి, మరో రెండు ఇతర కేసుల్లో అజయ్ అరెస్ట్ అయినట్లు సీఐ పేర్కొన్నారు.

మందుబాబులకు జైలు, జరిమానా

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్పీ ఆదేశాల మేరకు 14 రోజులుగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 91మంది మందుబాబులు పట్టుబడ్డారు. వారిని శనివారం కోర్టులో హాజరుపరచగా 50 మందికి జరిమానా, 41 మందికి జైలు శిక్ష విధిస్తూ (ఇద్దరికి ఏడు రోజులు, ఏడుగురికి మూడు రోజులు, ఐదుగురికి ఐదు రోజులు, 27 మందికి రెండు రోజులు) జడ్జి జ్యోతిర్మయి తీర్పు చెప్పారని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వారందరికీ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ ఎస్సై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంకెప్పుడు మద్యం తాగి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించారు. రోజూ డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.